RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే

దిన పత్రిక

ప్రతి సమస్య ఒక వరం లాంటిదే.
మన మేధ సంపత్తి ఏ పాటిదో తెలుసుకొని,
దాన్ని మరింత మెరుగు పరుచుకునే ఓ అవకాశమే..

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 233
శనివారం, ఆగస్టు 08, 2026 , పేజీలు - 4 వెల : 2/-

### తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వరుణ యాగం..

# ముహూర్తం ఫిక్స్

**హైదరాబాద్, ఆగస్టు 07:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. పాడి పంటలు సమృద్ధిగా పండి.. నదులు జలాశయాలు జలకళ సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి చెందని వేద పండితులు, అర్చకులు ఆగస్టు 10వ తేదీన ఈ యాగం నిర్వహించనున్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్‌లోని విజయ విహార్ ప్రా ంగ ణంలో ఈ యాగం వైభవంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.108 మంది



ఋత్వికులు,11 హోమకుండాలు, వేదపండితులు, అర్చకులు ఈ యాగ క్రతువును నిర్వహిస్తారు. ఎల్ నినో ప్రభావం లేకుండా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా యాగం నిర్వహిస్తారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఈ మహా వరుణ యాగం నిర్వహించనున్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. కృష్ణా, గోదావరి నదులతోపాటు రైతాంగ శ్రేయస్సు, రాష్ట్రం సుభిక్షంగా ఉండడం కోసం ఈ వరుణ యాగం చేపడుతున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి
చైర్మన్ ఓ ప్రకటన
విడుదల చేశారు.

## ఇంటి ముంగిటకే పౌర సేవలు

**: మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, ఆగస్టు 7:** నగరంలోని బేగంపేటలో ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనంగా ప్రారంభించారు. పాలనలో ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంపై నిర్వహించిన ఈ సదస్సులో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్యకుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా.దేవేష్ త్యాగి, అలాగే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ వంటి ప్రముఖ అధికారులు పాల్గొని తమ ఆమోదయోగ్యమైన సలహాలు, అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌తో పాటు మోసాలకు తావులేని బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. టీ-ఫైబర్ ద్వారా దాదాపు 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు డిజిటల్ కనెక్టివిటీ అందించడమే లక్ష్యం. అలాగే, వృద్ధులు, దివ్యాంగులకు పౌర సేవలను నేరుగా ఇంటి ముంగిటకే త్వరలో అందిస్తాం.

### ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ..

## నేతన్నలకు అండగా నిలువాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడు తున్నాయని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ కార్యక్రమాలుబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు.

### ఏదులపురం మున్సిపాలిటీని రాష్ట్రంలో

# నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

**: మంత్రి పొంగులేటి**

**ఖమ్మం, ఆగస్టు 7:** జిల్లాలోని ఏదులపురం మున్సిపాలిటీలో మార్నింగ్ వాక్ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏదులపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులను మంజూరు చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో మున్సిపాలిటీలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల మెరుగుదల వంటి



పనులను చేపడతామని తెలిపారు. పట్టణ అభివృద్ధిలో ఎలాంటి లోటు లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని మంత్రి పరిశీలించారు. నిలిచిన నీటిని తొలగించి దోమల వ్యాప్తి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మున్సిపాలిటీలోని పార్కుల అభివృద్ధి పనులను కూడా ప్రారంభించినట్లు మంత్రి చెప్పారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పిల్లలకు ఆట స్థలాలు, వృద్ధులకు సేదతీరే ప్రదేశాలు అందుబాటులో ఉండేలా పార్కులను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఏదులపురం మున్సిపాలిటీకి ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

# చేనేత కార్మికుల కళా

## నైపుణ్యానికి, కష్టానికి, అంకితభావానికి సెల్యూట్

**: హరీశ్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 7:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులు, కళాకారులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత రంగం అభివృద్ధికి, నేతన్న సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలియజేశారు. జాతికి బట్ట నేసే చేతులను కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా చేనేత రంగాన్ని ఆదుకోవాలని, నేతన్నకు భరోసా కల్పించాలని హరీశ్ పేర్కొన్నారు.హరీశ్ రావు పోస్ట్..'చేనేత కార్మికుల కళా నైపుణ్యానికి,



కష్టానికి, అంకితభావానికి సెల్యూట్. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటుతున్న చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు. చేనేత రంగం అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి. నేతన్న బతికితేనే మన చేనేత బతుకుతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. తెలంగాణ కోసం పోరాడిన నేతన్నలు నేడు తమ బతుకుల కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొంది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన నేతన్నకు చేయూత, నూలు సబ్సిడీ, బతుకమ్మ చీరలు, వర్కర్ టు ఓనర్ వంటి పథకాలతో చేనేత రంగానికి ఊపిరి పోస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరిచి, పథకాలను నిలిపివేసి నేతన్నల జీవితాలను సంక్షోభంలోకి నెట్టింది. మగ్గాలు మూగబోతున్నాయి.. వలసలు, అప్పులు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. జాతికి బట్ట నేసే చేతులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత.

### అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

## ఏకంగా 82 శాతం పడిపోయిన విరాళాలు



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎ స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొం దిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోం యింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరా ళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకా కుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది.

## భారతీయులకు మళ్లీ బ్యాడ్ న్యూస్..

### అమెరికాలో పుట్టినా పౌరసత్వం కష్టమే!



**అమెరికా:** అమెరికా పౌరసత్వ నిబంధనలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కఠిన వైఖరి ప్రదర్శించారు. విదేశీయుల పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేయడంతో పాటు 'బర్త్ టూరిజం'ను నిషేధిస్తూ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేశారు. ఇటీవల సుప్రీం కోర్టులో ఈ అంశంపై ప్రతికూల తీర్పు వచ్చినప్పటికీ.. చట్టపరమైన సర్దుబాట్లు చేస్తూ ట్రంప్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. ఏటా లక్షలాది మంది విదేశీయులు, ముఖ్యంగా తాత్కాలిక వీసాలపై ఉండే భారతీయుల పిల్లల భవిష్యత్తుపై ఈ ఆదేశాలు ప్రభావం చూపే అవకాశం ఉంది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసదారుల విషయమై మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశంలోకి వచ్చే విదేశీయుల పిల్లలకు లభించే హక్కులను పరిమితం చేసే దిశగా కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై ఆయన సంతకం చేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు పుట్టుకతోనే లభించే 'బర్త్ రైట్ సిటిజన్‌షిప్' హక్కును నియంత్రించడం, అక్రమంగా పౌరసత్వం పొందేందుకు దోహదపడుతున్న 'బర్త్ టూరిజం'ను పూర్తిగా నిషేధించడమే ఈ ఆదేశాల ప్రధాన లక్ష్యం. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల అమెరికాలోని వలసదారులతో పాటు అక్కడ తాత్కాలిక వీసాలపై ఉంటున్న వేలాది మంది భారతీయులపై అవకాశం ఉంది.

# 90 ఏళ్ల వృద్ధురాలి

## ఆకాంక్షను నెరవేర్చిన సీఎం చంద్రబాబు..

**బాపట్ల జిల్లా:** ఓ వృద్ధురాలి ఆకాంక్షను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చారు. తనను కలిసి ఫొటో దిగాలన్న ఆ వృద్ధురాలి కోరికను ఆయన తీర్చారు. ఇదే సమయంలో ఇచ్చిన మాట ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ చేనేత కుటుంబాన్నీ ముఖ్యమంత్రి కలిశారు. ఇటీవల చీరాలకు చెందిన పుష్పావతి (90) అనే వృద్ధురాలు సీఎం చంద్రబాబును కలవాలనే తన ఆకాంక్షను వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కొంతమంది సోషల్ మీడియాలో పోస్టు చేయగా అది వైరల్ అయ్యింది.ఆ వీడియో కాస్తా సీఎం చంద్రబాబు దృష్టికి రావడంతో వృద్ధురాలి ఆకాంక్షను నెరవేర్చాలని భావించారు. అంతర్జాతీయ చేనేత దినోత్సవం



నాడు ఆమెను చీరాలలో కలిసి మాట్లాడతానంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ మేరకు నేడు చీరాలలో తన అభిమాని అయిన ఆ వృద్ధురాలిని ముఖ్యమంత్రి కలిశారు. ఆప్యాయంగా పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కోరిక మేరకు ఫొటో దిగారు. సీఎం చంద్రబాబుతో ఫొటో దిగడంపై ఆ వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. జీవితకాల కోరిక నెరవేరిందంటూ సంబరపడ్డారు.మరోవైపు, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను కూడా సీఎం చంద్రబాబు కలిశారు. వారి వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో చేనేత దినోత్సవం రోజు కలుస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వారిని నేడు చీరాలలో ముఖ్యమంత్రి కలిశారు. ఈ సందర్భంగా మగ్గంతో నేసిన ఆయన చిత్రపటాన్ని బహూకరించారు.

# బీరంగూడలో యువకుడిపై కత్తులతో దారుణ దాడి.. ముగ్గురు అరెస్ట్



**-గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి: అఖిల భారత వడ్డెర సంఘం డిమాండ్**

**అమీన్‌పూర్, ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీరామ్‌నగర్ కాలనీలో యువకుడిపై జరిగిన కత్తి దాడి ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తున్న బండారి అరవింద్ అనే యువకుడిపై దుండగులు విచక్షణారహితంగా కత్తులతో దాడికి పాల్పడ్డారు.

**అటెంప్ట్ టు మర్డర్ (307 సెక్షన్) కింద కేసు నమోదు:**




ఈ ఘటనపై అమీన్‌పూర్ సీఐ ప్రవీణ్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇప్పటికే సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. అరెస్టయిన వారిపై సెక్షన్ 307 (హత్యాయత్నం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సీఐ తెలిపారు.

**సీఐకి వడ్డెర సంఘం ఫిర్యాదు – సానుకూల స్పందన:**
ఈ దాడి ఘటనపై అఖిల భారత వడ్డెర సంఘం నేతలు తీవ్రంగా స్పందించారు. సంఘం నాయకులంతా కలిసి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ ప్రవీణ్ రెడ్డిని కలిసి వివరణ కోరారు. దీనిపై సీఐ సానుకూలంగా స్పందించి, నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

**గంజాయి ముఠాలపై ఉక్కుపాదం మోపాలి:**
ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఒక కీలక విజ్ఞప్తి చేశారు. స్థానికంగా గంజాయి ముఠాల ఆగడాలు శృతిమించుతున్నాయని మండిపడ్డారు.
**"ఈ గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు ఇలాగే కొనసాగితే..**
ఈరోజు ఒకరి ఇంట్లో జరిగిన దారుణం, రేపు మనకు కూడా జరగవచ్చు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. కాబట్టి పోలీసులు వెంటనే అప్రమత్తమై, ఇలాంటి మత్తు బాచ్‌లపై ఉక్కుపాదం మోపాలి. ఈ ఘటనను మా వడ్డెర సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాము" అని వారు డిమాండ్ చేశారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:**
అమీన్‌పూర్ పోలీసులను కలిసిన వారిలో అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు తిరుమల దేవి, ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు వేముల దశరథ్, ప్రధాన కార్యదర్శి వరికుప్పల శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వేముల మధుసూదన్, నాంపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్

**- బీరంగూడ డివిజన్లో 8.55 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం.**






**అమీన్ పూర్ ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరియు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తెలిపారు. శుక్రవారం బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వారు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు నరసింహ గౌడ్ మాట్లాడుతూ, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటూ అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు నరసింహ గౌడ్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, డిఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్స్ బాశెట్టి కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు కృష్ణ, మల్లేష్, గోపాల్, తులసి రెడ్డి, జగదీష్, దాసు యాదవ్, మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సునీత, శ్రీకాంత్, గోవింద్, జ్ఞానేశ్వర్, కాలనీ ప్రెసిడెన్స్ రఘుపతి రెడ్డి, హరి ప్రసాద్, శ్రీనివాస్, రాజు,తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేనేత కళాకారులను ఆదుకోవాలి: అమీన్పూర్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు






**అమీన్ పూర్, ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్ పూర్ పట్టణ మరియు మండల పద్మశాలి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమీన్ పూర్ లోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజి, శ్రీ భావనాఋషి పద్మశాలి భవనంలో సంఘం గౌరవ అధ్యక్షులు మాకం మల్లేష్ నేతృత్వంలో ఈ వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా మాకం మల్లేష్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో కూడా చేనేత పరిశ్రమను కాపాడడం, ప్రోత్సహించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. మనం చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా నేతన్నల జీవితాలకు అండగా నిలబడటమే కాకుండా, మన దేశ సంప్రదాయాన్ని కూడా సంరక్షించిన వారమవుతామన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కళాకారులను మరింతగా గుర్తించి, వారికి అందవలసిన సంక్షేమ పథకాలు మరియు నిధులు సకాలంలో చేరేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట్ల ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరితో పాటు గోనె లింగం, మసుర ఆగమయ్య, భామిని జోగినాథ్, ఉడుత ఆనంద్, పంచల జనార్ధన్, బత్తుల కనకారావు, గోప శ్రీ విష్ణు, పొన్న ప్రభాకర్, నల్ల లింగయ్య, రామనాథం, నాగభూషణం, పట్నం కృష్ణ, సంగు ప్రభాకర్ తదితర పద్మశాలి కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కష్టంలో ఉన్న కుటుంబానికి చేగుంట ఉప సర్పంచ్ రఫీ అండ

**- 50 కేజీల బియ్యం పంపిణీ చేసి మానవత్వం చాటారు**



**చేగుంట ఆగస్టు 7 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము మోహన్ ఆర్థిక ఇబ్బంది వలన చనిపోయిన విషయం తెలుసుకొని గ్రామ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్ , చేగుంట ఉప సర్పంచ్ల మండల్ ఫోరం అధ్యక్షులు మహమ్మద్ రఫీకి తెలియజేయగా ఆర్థిక సహాయంగా 50కీ బియ్యం పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో చాకలి కుమార్, మఠం ఆంజనేయులు,ఎగ్గడి యాదగిరి,ఎగ్గడి నర్సింలు, కొమ్ము శ్రీనివాస్,మైసన్న గారి నాగరాజు,కొమ్ము బాబు ,ప్రసాద్,అశోక్,మల్లయ్య,నర్సయ్య,కిషన్,షాదుల్,కరుణాకర్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# కాంతుల్లో మునిగిన చేగుంట: ఆదివారం శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం


**- మెదక్ రోడ్డులో విద్యుత్ కాంతులు, భక్తి పాటలు ముస్తాబైన చేగుంట**



**చేగుంట, ఆగస్టు 7 మెదక్ టుడే న్యూస్** చేగుంట పట్టణ కేంద్రంలో ఆధ్యాత్మిక శోభతో మెరిసిపోతోంది. రాబోయే ఆదివారం నాడు ఎంతో ఘనంగా నిర్వహించనున్న చేగుంట లో కొలువైన శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవానికి గ్రామం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పండగ వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు చేగుంట పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఆధ్వర్యంలో గ్రామంలోని మెదక్ రోడ్డును రంగురంగుల విద్యుత్ దీపాలు, భారీ ఎల్ఈడీ తోరణాలు, సుందరమైన స్వాగత ద్వారాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు.?రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల నడుమ మెదక్ రోడ్డు కాంతులీనుతూ కంటికి విందుగొలుపుతోంది. దీనికి తోడు ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన మైకుల ద్వారా మార్మోగుతున్న భక్తి పాటలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి. ఆదివారం జరిగే ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో, గ్రామ పంచాయతీ పాలకవర్గం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. అమ్మవారి కృపాకటాక్షాల కోసం గ్రామ ప్రజలు, భక్తులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# చేగుంట మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలు

**- వెంటనే తొలగించాలని గ్రామస్తుల విజ్ఞప్తి**



**చేగుంట, ఆగస్టు 7 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల కేంద్రంలోని అంబేద్కర్ బొమ్మ వెనుక గల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలు, తీగలు అల్లుకొని పూర్తిగా కనిపించకుండా పోయాయి.వర్షాకాలం కావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం చిన్న పిల్లలు ఇక్కడ నుండి ప్రాథమిక పాఠశాలకు వెళుతుంటారు. మరమ్మతుల సమయంలో విద్యుత్ సిబ్బందికి కూడా గుర్తించడం కష్టంగా మారుతుందని తెలిపారు.వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించి, ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మానవత్వం చాటిన చేగుంట ఉపసర్పంచ్ రఫీ

**- డెలివరీ, ఆపరేషన్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం**



**చేగుంట ఆగస్టు 7 మెదక్ టుడే న్యూస్**
మానవత్వంతో స్పందించిన చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ రెండు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారు.చేగుంట మండల కేంద్రంలోని డబల్ బెడ్ రూమ్ లలో నివసిస్తున్న అంబికకు డెలివరీ కావడంతో ఆమెకు పండ్లు, బ్రెడ్, భోజనంతో పాటు రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు.అదేవిధంగా కాలుకు ఆపరేషన్ అయిన సిహెచ్ రవళిని పరామర్శించి, ఫ్రూట్స్,



బ్రెడ్ కొనుక్కోమని రూ.1000 ఆర్థిక సహాయం అందించారు.కష్టంలో ఉన్నవారికి చేయూతనిచ్చిన రఫీ చర్యను గ్రామస్తులు అభినందించారు.

# దేవస్థాన భూములను కాపాడాలి



**చిట్యాల, ఆగస్టు 7**

టీటీడీ కళ్యాణ మండపం కోసం ప్రజల విరాళాలతో కొనుగోలు చేసిన సర్వే నంబర్ 649లోని ఎకరం 12 గుంటల భూమిని సేల్ అగ్రిమెంట్ ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసి పరిరక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్యాణ మండపం స్థలాన్ని కుదించి రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రయత్నాలు అనుమానాలకు తావిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నామని, ప్రతిపాదిత స్థలంలోనే కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. అలాగే మీడియాపై పరువు నష్టం దావా వేస్తామంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజల ముందే వాస్తవాలను వెల్లడించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొబ్బల శివశంకర్ రెడ్డి, జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, నిమ్మనగోటి శ్రీనివాస్, ఎస్కే షబానా అజీముద్దీన్, ఆగు అశోక్, మెండే సైదులు, జిట్టా బొందయ్య, జిట్ట శేఖర్ , ఆవుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు..

# శ్రామిక వర్గాల సమస్యలపై పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ : చెరుపల్లి సీతారాములు



**చిట్యాల, ఆగస్టు 7 (**

శ్రామిక వర్గాల సమస్యలపై, కష్టజీవుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కామ్రేడ్ నారబోయిన సత్తమ్మ సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలు బలంగా ఉన్నప్పుడే పాలక ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. చిట్యాల రైస్‌మిల్లు డ్రైవర్లు, కార్మికుల హక్కుల కోసం తన భర్త నారబోయిన భిక్షమయ్యతో కలిసి సత్తమ్మ ఎన్నో ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. అనంతరం సత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, సరోజ, మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య, బూర్గు కృష్ణవేణి, చింతపల్లి కృష్ణయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం, జిల్లా నాయకులు దండెంపల్లి సత్తయ్య, రమేష్, నారబోయిన శ్రీను, మమత తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యునిగా చలమయ్య నియామకం



**తుర్కపల్లి ,ఆగస్టు 7** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యునిగా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు కందుకూరి చిన్న చలమయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రస్థాయిలో సేవ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కన్వీనర్ ఉప్పల డాక్టర్ ఉప్పల శారద, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ,జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్, రాష్ట్ర నాయకులు పాశం భాస్కర్, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ట్రేడర్స్ సెల్ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, వ్యాపార వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వ్యాపార వర్గాలు విస్తృతంగా తీసుకెళ్ళేందుకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు

# చేనేత మహిళా కార్మికులకు ఘనంగా సన్మానం..

**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 7**



జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా... చేనేత కార్మికులకు, మహిళ చేనేత కార్మికులకు ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి గుర్రపు బాలరాజు మాట్లాడుతూ... అన్ని రంగాలలో చేనేత కార్మికులు ముందుండాలని పిలుపునిచ్చారు . విద్యారంగంలో కూడా చేనేత కార్మికుల పిల్లలు ముందుండాలని... అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం... చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. చేనేత జియో టాకింగ్, చేనేత భీమా, ముద్ర లోన్, చేనేత రుణమాఫీ, త్రిఫ్టుఫండ్ చేనేత కార్మికుడు 1200 రూపాయలు డిపాజిట్ చేస్తే గవర్నమెంట్ రెండింతలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వనుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష కార్యదర్శి బేతి కృష్ణమూర్తి, మంగళ కృష్ణమూర్తి, డైరెక్టర్ కొండా అనిత, వేముల వెంకటేశ్వర్లు, గణపురం నాగేష్, పామ్ రమేష్, వల్లాల శ్రీనివాస్, పాసికంటి జనార్ధన్, కుందారపు గోపాల్, గొల్లపల్లి బిక్షపతి, వేముల నరేష్, నరసింహులు బొమ్మ, జంజీరాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# భానూరులోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ను సందర్శించిన గీతం విద్యార్థులు

- క్షిపణి సాంకేతికపై ప్రత్యక్ష అవగాహన





**పటాన్ చెరు, ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐడీఎస్) విభాగాల విద్యార్థులు, భారత దేశంలోని ప్రముఖ రక్షణ ఉత్పాదక సంస్థలలో ఒకటైన భానూరులోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)ను సందర్శించి, భారతదేశపు అధునాతన క్షిపణి సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహనతో పాటు విలువైన పారిశ్రామిక అనుభవాన్ని పొందారు. ఈ పర్యటన సందర్భంగా, విద్యార్థులు ఆధునిక క్షిపణి సాంకేతికతలపై ఒక విజ్ఞానదాయక సదస్సులో పాల్గొన్నారు. అలాగే వారికి మిలన్, కొంకుర్స్, ఇన్వర్, కొంకుర్స్-ఎం వంటి ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణి వ్యవస్థల గురించి బీడీఎల్ అధికారులు పరిచయం చేశారు. అంతే కాకుండా, ఆస్ట్రా గగనతల క్షిపణి, దానిని ఎస్.యూ-30, మిరాజ్ యుద్ధ విమానాలలో అనుసంధానించడం గురించి తెలుసుకునే అవకాశం కూడా వారికి లభించింది. గీతం విద్యార్థి బృందం బీడీఎల్ లోని ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగాన్ని పర్యటించి, అక్కడ అత్యంత కచ్చితత్వంతో కూడిన సీ.ఎన్.సీ. మెషిన్లు, కీలకమైన క్షిపణి భాగాల ఉత్పత్తిని ప్రత్యక్షంగా పరిశీలించారు. కొంకుర్స్ క్షిపణి లాంచర్ వ్యవస్థ ప్రత్యక్ష ప్రదర్శన, క్షిపణి అసెంబ్లీ విభాగాన్ని సందర్శించడం ద్వారా, అధునాతన క్షిపణి వ్యవస్థల తుది అసెంబ్లీ, మోహరింపు యంత్రాంగాల గురించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కలిగింది. రక్షణ ఇంజనీరింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమేషన్, స్వదేశీ సాంకేతిక ఆవిష్కరణలపై విద్యార్థుల అవగాహనను గణనీయంగా పెంచింది. అదే సమయంలో, తరగతి గది అభ్యాసాన్ని పారిశ్రామిక అనుభవంతో అనుసంధానించడం ప్రాముఖ్యతను కూడా ఇది నొక్కి చెప్పింది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ సమన్వయంతో జరిగిన ఈ పారిశ్రామిక పర్యటన, 30 మంది విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకులకు భారతదేశపు స్వదేశీ క్షిపణి ఉత్పాదక సాంకేతికతలు, అధునాతన రక్షణ ఉత్పత్తి వ్యవస్థలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. గీతం విద్యార్థి బృందాన్ని బీడీఎల్ మానవ వనరుల విభాగాధిపతి గంగయ్య స్వాగతించగా, అదే విభాగానికి చెందిన శిక్షణాధికారి నందని, ఇతర అధికారులు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి బీడీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) నాగేశ్వరరావు, దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో క్రమశిక్షణ, సమష్టి కృషి, సాంకేతిక నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బీడీఎల్ యాజమాన్యం, సాంకేతిక నిపుణులు చూపిన ఆత్మీయ ఆతిథ్యానికి, అలాగే విద్యార్థులకు సుసంపన్నమైన అభ్యాస అనుభవాన్ని అందించినందుకు గీతం బృందం కృతజ్ఞతలు తెలియజేసింది. పారిశ్రామిక సందర్శనను విజయవంతంగా నిర్వహించి, భారతదేశ రక్షణ సాంకేతిక రంగంలో అనుభవపూర్వక అభ్యాసానికి వీలు కల్పించినందుకు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# చందానగర్ శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు





**శేరి లింగంపల్లి, ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

శేరి లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో నేడు బోనాల పండుగను అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. అందమైన అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, విద్యార్థుల సంప్రదాయ దుస్తులు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా బోనం ఎత్తుకుని వేడుకలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు సైతం ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకుంటూ బోనాలు ఎత్తుకొని పండుగను ఘనంగా జరుపుకున్నారు. వారు ధరించిన సంప్రదాయ వేషధారణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద పాటలు, నృత్యాలు మరియు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల ద్వారా మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తూ ఈ వేడుకను విజయవంతం చేశారు. ఇటువంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవ భావం పెంపొందడమే కాకుండా, విద్యార్థులలో ఐక్యత మరియు సాంస్కృతిక అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. చివరగా అందరూ సంతోషంగా పాల్గొని ఈ వేడుకను ముగించారు.

# భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే దిశగా చందానగర్ శ్రీ చైతన్య పాఠశాలలో పదవీ నియామక కార్యక్రమం

**శేరి లింగంపల్లి ఆగస్టు 07:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**



విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో చందానగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల శాఖలో పదవీ నియామక కార్యక్రమం ఘనంగా జరిగింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, క్రమశిక్షణ, సేవా దృక్పథాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువుతోపాటు విలువలు, నాయకత్వ నైపుణ్యాలకు ఈ పాఠశాల వేదికగా నిలుస్తోందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీధర్, శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. నాయకత్వం అంటే కేవలం హోదా కాదని, బాధ్యతతో సేవ చేయడమే నిజమైన నాయకత్వమని వారు పేర్కొన్నారు. మానవ విలువలు, క్రమశిక్షణ, సమాజ సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ, “నాయకత్వం అనేది ఒక పదవి కాదు, అది ఒక బాధ్యత. విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు నాయకత్వం, విలువలు, సేవాభావం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం మా పాఠశాల ప్రధాన లక్ష్యం. ఈరోజు బాధ్యత స్వీకరించిన ప్రతి విద్యార్థి రేపటి సమాజానికి ఆదర్శ నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం” అని తెలిపారు. చివరగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# కల్తీని కట్టడి చేయాల్సింది పోయి.. జర్నలిస్టులపై కేసులా.?

- కల్తీ పన్నీర్‌పై పోరాటం చేస్తే.. పోలీస్ స్టేషన్‌లో నిర్బంధమా.?
- కల్తీ మాఫియాకు అండ ఎవరిది.? జర్నలిస్టులపై పోలీసుల ఉక్కుపాదం ఎందుకు.?
- అక్రమాలను ప్రశ్నిస్తే నేరమా.? జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నమా.?
- కల్తీ పన్నీర్‌ను పట్టించేందుకు వెళ్తే.. రిపోర్టర్లపైనే కేసులా.?
- కల్తీ దందాపై సమాచారం ఇచ్చిన జర్నలిస్టులకు పోలీసుల వేధింపులా.?
- కల్తీ వ్యాపారులపై చర్యలు ఎక్కడ.? ప్రశ్నించిన జర్నలిస్టులపైనే కొరడా!
- ప్రజల ఆరోగ్యం కోసం పోరాడితే.. పోలీస్ స్టేషన్‌లో గంటల తరబడి కూర్చోబెట్టడమా.?
- కల్తీని అడ్డుకునే జర్నలిస్టులకే అడ్డంకులు, ఓయూ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- కల్తీ మాఫియాను కాపాడుతున్నారా.? జర్నలిస్టులనే నిందితులుగా చేస్తున్నారా.?

"ఉస్మానియా పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో ఓ మిల్క్ షాపుకు కల్తీ సరఫరా అవుతున్నట్లు పన్నీర్ ప్యాకింగ్ అవుతున్నట్లు జర్నలిస్టులకు సమాచారం అందింది. ఇన్ఫర్మేషన్ ను కన్ఫర్మ్ చేసుకుని పోలీస్, టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు వరుసగా సమాచారం ఇచ్చినా ఫలితం శూన్యం.. ఫిర్యాదు చేసిన జర్నలిస్టులపైనే కేసు పెట్టారంటూ ఆవేదన"


జర్నలిస్టుపై దాడి చేస్తున్న దృశ్యం


మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం




పోలీసుల ముందే జర్నలిస్టులను దూషిస్తున్న దృశ్యం

హైదరాబాద్,ఆగస్టు,7, మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)
కల్తీ ఆహార పదార్థాల తయారీ, సరఫరా, విక్రయాలపై హైదరాబాద్ సిపి సజ్జనార్, డీజీపీ సీవీ ఆనంద్, పోలీసు ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పోరాటంలో తాము సైతం భాగస్వాములమవుతామని భావించిన జర్నలిస్టులకు ఎదురైన పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కల్తీ ఆహార పదార్థాలపై వరుసగా ఇన్వెస్టిగేషన్ చేస్తూ, సమాచారం అందిన ప్రతిసారీ సంబంధిత పోలీసు, ఎస్ఓటి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందిస్తున్న రిపోర్టర్లకే పోలీసుల నుంచి ప్రశ్నలు, కేసులు, గంటల తరబడి స్టేషన్‌లో కూర్చోబెట్టే పరిస్థితి ఎందుకొచ్చిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇప్పటికే అల్వాల్, సికింద్రాబాద్ పికెట్ ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాలకు సంబంధించి సమాచారం అందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సీజ్ చేయించిన జర్నలిస్టులు. తాజాగా హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో కల్తీ పన్నీర్ సరఫరా అవుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ ఓ మిల్క్ షాప్ ముందు ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపించడంతో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు.వెంటనే మేడ్చల్ జిల్లా ఎస్ఓటి అధికారులకు సమాచారం అందించగా, అది హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో హైదరాబాద్ పోలీసు అధికారులను సంప్రదించినట్లు వారు తెలిపారు. ఏసీపీ జగన్, సెక్టర్ ఇంచార్జ్ కరుణాకర్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని, ఫుడ్ సేఫ్టీ అధికారులకు, సంబంధిత హెల్ప్‌లైన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు లొకేషన్ పంపాలని కోరడంతో లొకేషన్‌ను సైతం షేర్ చేసినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు రోడ్డుకు అవతలి వైపు వేచి ఉన్నారు. అయితే అప్పటికే అక్కడికి వచ్చిన పోలీసులు వాటిని పరిశీలించి అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చినప్పుడు అక్కడికి వచ్చిన పోలీసులు సైతం పూర్తి వివరాలు సేకరించి తరువాత అధికారులతో మాట్లాడారు. షాపులో పని చేసి వ్యక్తి, ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో బంధువు ను అని ఒక వ్యక్తి దాదాపు 20 మంది వరకు వెంట తీసుకొచ్చి జర్నలిస్టుల పైనే చేయి చేసుకోవడం వారిని అసభ్య పదజాలాలతో దూషించడం తోపాటు వాళ్ళ ఆగడాలను చిత్రీకరిస్తున్న మహిళా జర్నలిస్టుపై దాడి చేసి ఫోన్ లాక్కున్నారు. "మీరు వెళ్లిపోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయండి" అంటూ బెదిరించినట్లు జర్నలిస్టులు పేర్కొన్నారు.

### ఫిర్యాదు చేసిన వారిపైనే కేసా.?

దాడి, దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు చేసేందుకు ఓయూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జర్నలిస్టుల వాదన ప్రకారం.. దాదాపు సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదు చేశామని అయితే తమ ఫిర్యాదుపై తక్షణ ప్రాథమిక విచారణ చేయకుండా, తమ తర్వాత దాదాపు రాత్రి 9 గంటలకు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారని ఆరోపించారు. అనంతరం తమను పోలీస్ స్టేషన్ లోనే గంటల తరబడి విచారణ పేరుతో కూర్చోబెట్టారని వారు పేర్కొన్నారు. విచారణలో మీకు ఏ అధికారం ఉంది అక్కడికి వెళ్లడానికి.? అంటూ ప్రశ్నించారని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో భాగంగానే అక్కడికి వెళ్లి ఫోటోలు, వీడియోలు తీసి, సంబంధిత అధికారులకు సమాచారం అందించామని చెప్పినా తమను నిందితుల మాదిరిగా చూశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకలిగా ఉందని, భోజనం తెప్పించాలని కోరినా స్పందించలేదని టిఫిన్ చేసి వస్తామని చెప్పినా బయటకు పంపలేదని, రాత్రి ఒంటి గంట వరకు పోలీస్ స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. సంతకాలు తీసుకొని నోటీసులు ఇస్తామని చెప్పినా నోటీసులు ఇవ్వలేదన్నారు. తర్వాత రోజు ఆగస్టు 5న సాయంత్రం 5 గంటలకు రావాలని ఎస్సై కరుణాకర్ చెప్పడంతో స్టేషన్‌కు వెళ్లగా, రాత్రి 9 గంటల వరకు కూర్చోబెట్టి తమపై ఉన్న కేసులను పరిశీలించి నిర్ణయం తీసుకున్న తర్వాత నోటీసులు ఇస్తామని చెప్పారని జర్నలిస్టులు తెలిపారు.

### కల్తీని కట్టడి చేయాలా.? ప్రశ్నించే గొంతును కట్టడి చేయాలా.?

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార మాఫియాను అడ్డుకునేందుకు సాక్షాత్ హైదరాబాద్ సీపీ సజ్జనార్, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్న సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఉన్న అధికారులకు సమాచారం అందించిన జర్నలిస్టులే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తే ఇక అక్రమాలను వెలుగులోకి తెచ్చే ధైర్యం ఎవరికుంటుందనే ప్రశ్న తలెత్తుతోంది.

### కల్తీ పన్నీర్ తయారి, సరఫరా చేసేవారిపై చర్యలా.? లేక కల్తీని బయటపెట్టే రిపోర్టర్లపై చర్యలా.?

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం చేసిన జర్నలిస్టులను నిందితులుగా చూడటం సమంజసమేనా.? అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే ప్రతి రిపోర్టర్‌పై కేసులేనా.? ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన విచారణ చేపట్టి, సంఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాలు, ఫిర్యాదుల తేదీలు, పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. నిజానిజాలు నిగ్గుతేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమాలను ప్రశ్నించే కలం బలహీనపడితే.. ప్రజల తరఫున నిలబడే గొంతు మూగబోతుంది.కల్తీ మాఫియాను కట్టడి చేయాల్సిన వ్యవస్థలే, ప్రశ్నించే జర్నలిస్టులనే కట్టడి చేస్తే ప్రజాస్వామ్యంలో మిగిలేది ఏమిటో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.

# హర్ ఘర్ తిరంగా

- ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరాలి
- మండల అధ్యక్షుడు కోడె రమేష్



రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు7
హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకుభారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశా ముఖ్య అతిథి జిల్లా మీడియా ఇంచార్జ్ రాజు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయడం ద్వారా దేశ గౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందుండాలని సూచించారు.ఈనెల 10 తేదీన ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ప్రతి కార్యకర్త నాయకులు కుటుంబ సమేతంగా జాతీయ జెండాను ఇంటిపై ఆవిష్కరించాలని అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర మరియు జిల్లా అధ్యక్షుల పిలుపుమేరకు ఈనెల12 తేదీన మండల స్థాయిలో హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్.సత్యనారాయణ.ఉపాధ్యక్షులు నర్సింలు.కార్యదర్శులు రాజు.స్వామి.నాయకులు పత్తి స్వామి.బండ దేవయ్య.నాగరాజ్ గౌడ్.సర్వోత్తమ్.శ్రీనివాస్.తిరుపతి.లింగం.శ్రీనివాస్ చారి.శ్రీనివాస్.దేవేందర్ యాదవ్.ప్రసాద్.రమేష్.శంకర్.రాజు.శ్రీధర్గౌడ్.రాజు.నవీన్.ఎల్లం.స్వామి పాల్గొన్నారు

# కేశిరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రం లో తల్లిపాల వారోత్సవాల...!



జనగామ/బచ్చన్నపేట, ఆగస్టు 07 ):
తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ టీచర్ భైరగొని అంజుమ్... తల్లులకు పలు సూచనలు చేశారు. ముఖ్యగా తల్లి డెలివరీ అయిన తర్వాత మొదటిగా వచ్చే ముర్రుపాలను పిల్లలకు గంటలోపు తప్పకుండా పట్టించాలి. ఆ ముర్రు పాలు పట్టించినట్లయితే మనం పిల్లలకు అమృత సంజీవిని అందించిన తల్లులం అవుతాం అని... పిల్లలకు ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలు మాత్రమే పట్టించాలని, పిల్లలు తల్లి నుండి తాగే పాలలో మొదటగా నీటి అవసరాన్ని తీర్చేవి ఆ తర్వాత వచ్చే పాలు బిడ్డకు శక్తినిచ్చేవి గా ఉంటాయి అని, ఒక్క రోజులో బిడ్డ కోరినన్నిసార్లు తల్లి బిడ్డకు పాలు పట్టాలని, ఆరు నెలలు నిండిన తర్వాత కూడా అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కూడా పట్టాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అంజుమ్, ఆశాలు సులోచన, రమ, తల్లులు, కావ్య, వాని, నవనీత, రవళి, సంధ్య, కళ్యాణి, సుజాత, చైతన్య, సరళ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికి హటావో దేశ్ కి బచావో



రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు7
మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిజెపి హటావో దేశ్ బచావో కరపత్రం ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మానేరు పరిరక్షణ కమిటీ కన్వీనర్ గుంటి వేణు, మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 న ఎగువ మానేరుకు చాడ వెంకటరెడ్డి సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే వస్తున్నారు కాబట్టి ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలోకో కన్వీనర్లు చెన్నమనేని పురుషోత్తం రావు,భూస వేణు.మార్వాడి సుదర్శన్ (డిఎల్ఎఫ్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) జాతీయ మాలల ఐక్య వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం. నాయకులు ఈబాదుల్లా ఖాన్.ఎర్ర మల్లయ్య.సిపిఐ నాయకులు దోసల వెంకటేష్. నాందేడ్ మనోజ్ కుమార్.బరిగెల బిక్షపతి.తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా కట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కళ్యాణం వైభవంగా



మల్కాజిగిరి ఆగస్టు 07
ఇందిరా నెహ్రూ నగర్ లోని కట్ట మైసమ్మ దేవాలయం లో లిఅమ్మవారి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. లిఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో లిసుదామమా,శెంకర్,నాగేష్ గౌడ్ విజయ్,లక్ష్మణాచారి,మరియు మహిళానాయకురాలు,లక్ష్మి,లలిత, కుసుమ,వరలక్ష్మి,జ్యోతి,కవిత తదితరులు పాల్గొన్నారు.

# హై లెవెల్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

- బిజెపి నాయకులు జలదీక్ష
- బీజేపీ అధ్యక్షులు కోడె రమేశ్




రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు7(ప్రజా అక్షరం)
గంభీరావుపేట టు లింగన్నపేట హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని బిజెపి అధ్యక్షులు కోడె రమేష్ ఆధ్వర్యంలో నీటిలో (జల దీక్ష) నిరసన వ్యక్తం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కేటీ రామారావు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం అంటూ ర్యాలీలు పాలాభిషేకాలు చేయించుకొని ఉన్న పాత బ్రిడ్జిని కూలగొట్టి ప్రతి వర్షాకాలానికి ప్రయాణికులకు రైతులకు వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు.ఇక్కడి ఓట్లతో గెలుపొంది ఏనాడు కూడా బ్రిడ్జి నిర్మాణం పనులపై గాని ప్రజా సమస్యలపై గాని సమీక్ష నిర్వహించకుండా రాష్ట్రం మీద పడి ఊరేగుతున్నాడని ఎద్దేవా చేశారు.రానున్న రోజులలో కేటీఆర్ కి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పై ఎటువంటి పురోగతి సాధించకపోవడంతో వర్ష ప్రభావం వల్ల ఎగువ మానేరు కు జలకళ రావడంతో ప్రభుత్వ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏదో సాధించినట్టుగా ఎగువ మానేరును సందర్శించారు తప్ప,హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు పరిశీలించకుండా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న పట్టించుకోవడంలేదని తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం,అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..